క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయముంటుందని సెస్ ఏఈ నగేశ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నగదు ప్రోత్సాహకాలు అందజేత



ఓబులాపురంలో ప్రోత్సాహకం అందిస్తున్న మేనేజర్

ఇల్లంతకుంట: మండలంలోని వివిధ గ్రామాల కరీంనగర్ డెయిరీ పాడి రైతులకు పలు సంక్షేమ పథకాల ప్రోత్సాహకాలు ఆదివారం పాల ఉత్పత్తి కేంద్రాల్లో అందించారు. 135 మంది రైతులకు దూడల దాన కింద రూ.67,500, పాడి రైతు భరోసా కింద రైతుల పిల్లలు 29 మందికి రూ.23,200, బహువార్షిక పశుగ్రాసం సాగు చేసుకున్న 36 మంది రైతులకు రూ.61,500 అందించారు. అగ్రహారం మేనేజర్ రవీందర్, రాజిరెడ్డి, రూట్ సూపర్‌వైజర్లు వెంకటరామిరెడ్డి, కత్తి బాలయ్య, గుర్రం సతీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంతెన పరిశీలించిన నాయకులు



ఎల్లారెడ్డిపేట: పదిర–రామలక్ష్మణపల్లె గ్రామాల మధ్య మానేరు వాగుపై వరదలతో తెగిపోయిన వంతెనను ఆదివారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. తెగిన రోడ్డు పరిస్థితిపై ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి శాశ్వత మరమ్మతు కోసం కృషి చేస్తామని బ్లాక్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి అన్నారు. నాయకులు గౌస్, రాంరెడ్డి, బాబు, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీపాల్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు..



గుండారంలో లైట్లను ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ ప్రభుత్వం మారుమూల పల్లెల అభివృద్ధే లక్ష్యంగా నిధులు మంజూరు చేస్తూ ముందుకు పోతోందని ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. రాచర్లగుండారంలో ఎస్డీఎఫ్ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆదివారం నాయకులతో కలిసి ప్రారంభించారు. సద్ది లక్ష్మారెడ్డి, గుండాడి రాంరెడ్డి, రాజేందర్, శ్రీనివాస్, భాస్కర్, రాజు, దేవేందర్, రవీందర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

తంగళ్లపల్లి: సారంపల్లి మిత్రసేన యూత్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొనుగాని రంజిత్, ఉపాధ్యక్షుడిగా రాముల బాబు, ప్రధాన కార్యదర్శిగా జెల్ల వెంకటేశ్, ఉమ్మడి కార్యదర్శిగా బోనుగాని సంజిత్, క్యాషియర్‌గా బొద్దుల అరవింద్‌ను ఎన్నుకున్నారు.

ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్



తంగళ్లపల్లి: మండల ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొక్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల రమేశ్, ఉపాధ్యక్షుడిగా ఈదులకంటి మహేందర్‌రెడ్డి, కోశాధికారిగా తుపాకుల సత్యనారాయణ ఎన్నికయ్యారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

గంభీరావుపేట: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జంగం రాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అతడి కుటుంబాన్ని ఆదివారం మండల నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, మండల అధ్యక్షుడు హమీద్, నాయకులు నాంపల్లి, ప్రవీణ్ పాల్గొన్నారు.



గంభీరావుపేట: రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కుంకుమ పూజలు



బొప్పాపూర్‌లో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



కనగర్తిలో అన్నదానం

ఏకదంతాయ.. వక్రతుండాయ..

వినాయక మండపాల వద్ద ఆదివారం ఐదో రోజు కుంకుమ పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కొన్నిచోట్ల నిమజ్జనం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



సిరిసిల్లలోని చంద్రంపేటలో గణనాథుని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు



వేములవాడలో కుంకుమ పూజలు



బోయినపల్లి: తడగొండ గణేశ్ యూత్ ఆధ్వర్యంలో 60 రకాల పిండి వంటలతో నైవేద్యం



ముస్తాబాద్: మార్కండేయ ఆలయంలో పూజలు



పెద్దలింగాపురంలో గణేశ్ కమిటీ మండపంలో..



లండన్‌లో వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న వేములవాడకు చెందిన సాయిని దేవయ్య, కుటుంబ సభ్యులు



మస్కట్‌లో పూజ చేస్తున్న కొండేటి దేవేందర్ దంపతులు

విదేశాల్లో గణేశ్ ఉత్సవాలు

సిరిసిల్లటౌన్/వేములవాడరూరల్: విదేశాల్లో ప్రవాస భారతీయులు వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. తెలుగు సంప్రదాయాల్ని గౌరవిస్తూ ఉత్సవాలను జరుపుకుంటున్నారు. మస్కట్‌లో కొండేటి దేవేందర్ కుటుంబ సభ్యులు తమ ఇంట్లో వినాయక ప్రతిమను ప్రతిష్ఠించి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. వేములవాడకు చెందిన సాయిని దేవయ్య–విజయ దంపతులు కొడుకులు, కోడళ్లు, మనవళ్లు, మనవరాళ్లతో కలిసి లండన్‌లో ఉంటున్నారు. వారు ఉండే ప్రాంతంలో వినాయకున్ని ఏర్పాటు చేసుకొని ఆదివారం సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.

తెలుగు తేజం అవార్డు అందుకున్న శ్రీనివాస్



ఎల్లారెడ్డిపేట: బాకూర్‌పల్లికి చెందిన యువ కవి కట్ల శ్రీనివాస్ ప్రతిష్ఠాత్మకమైన తెలుగు తేజం అవార్డును ఆదివారం అందుకున్నారు. అంతర్జాతీయ సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఏటా అందించే అవార్డుకు శ్రీనివాస్ ఎంపిక కాగా.. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ఇటీవలి కాలంలో శ్రీనివాస్ రాసిన రచనలు సమాజానికి చైతన్యాన్ని పెంపొందించేలా ఉన్నాయని, అందుకే అవార్డుకు ఎంపిక చేసినట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ తెలిపారు.

వ్యక్తిపై కేసు

కోనరావుపేట: వాట్సాప్ గ్రూపులో మతపరమైన పోస్ట్ పెట్టిన కనగర్తి గ్రామానికి చెందిన కురుకుంట్ల శ్రీనివాస్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. శ్రీనివాస్ మండల గ్రూపులో హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా పోస్ట్ పెట్టడంతో.. బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఊహాలోకాల్లో విహరించేదేరా స్నేహం

ఊహాలోకాల్లో విహరించేదేరా స్నేహం.. తనివి తీరా తాగినా తీరని దాహం స్నేహం అంటూ కూర దేవేందర్ అలియాస్ అమర్ రాసిన గీతాన్ని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్మన్ విమలక్క ఆలపించారు. తన భర్త కూర దేవేందర్ 1975–76లో 10వతరగతి చదువుకున్న వేములవాడ ప్రభుత్వ హైస్కూల్‌లో జరిగిన సమ్మేళనంలో అమర్‌తో కలిసి హాజరయ్యారు. సంతోషంగా ఉందని పేర్కొంటూ తన మిత్ర బృందంలో కలిసి స్టేజీపై స్నేహానికి సంబంధించిన గీతాన్ని ఆలపించారు. అమర్ రచయితగా, తాను గాయనిగా తాము కలిసి నడిచే జీవితం ఎంతో ఆనందంగా ఉందని విమలక్క అన్నారు.



గానం వినిపిస్తున్న విమలక్క

అర్ధ శతాబ్దం తర్వాత..

- 50 ఏళ్లకు కలుసుకున్న బాల్య మిత్రులు
- నెమరేసుకున్న మధురస్మృతులు
- వేములవాడ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

వేములవాడ: వేములవాడ హైస్కూల్ ప్రాంగణం ఆదివారం జ్ఞాపకాల సందడి చేసింది. 1975–76లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్నేహ సమ్మేళనం పేరుతో ఒకేచోట చేరుకున్నారు. యాభై ఏళ్ల తర్వాత స్కూల్ మైదానంలో కలుసుకున్న వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి మిత్రులు, బాల్య స్మృతులు, తరగతి గదులు, టీచర్ల జ్ఞాపకాలు వీరిని కాసేపు మళ్లీ ఆ రోజుల్లోకి తీసుకెళ్లాయి. గురువుల జ్ఞాపకాలతో వారి కళ్లలో నీళ్లు ఉబికివచ్చాయి. జనశక్తి అగ్రనేత కూర దేవేందర్ అలియాస్ అమర్‌తోపాటు అడ్వకేట్లు, ఇంజినీర్లు, ఉపాధ్యాయులు, వ్యాపారవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు వంటి 80 మందికి పైగా ప్రముఖులు హాజరై పాఠశాల అభివృద్ధిపై చర్చించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఆర్గనైజర్లు ఇప్పపూల దేవయ్య, వారాల దేవయ్య, రేగుల దేవేందర్ 3 మాసాలుగా కృషి చేశారు.

అపజయమే.. జయమైంది



మేము 1975 ఎమర్జెన్సీ కాలంలో 10వతరగతి చదివాం. ఏబీసీడీ సెక్షన్లలో మొత్తంగా 160 మందిమి ఉన్నాం. ఇందులో కేవలం ఐదుగురు మాత్రమే పాస్ అయ్యారు. ఫెయిల్ అయిన వారిలో మేమిద్దరం ఉన్నాం. చొప్పకట్ల చంద్రమౌళి సార్ మీ అన్న చాలా క్లైవర్.. నువ్వెందిరా పూర్ ఉన్నావ్ అని చెప్పడం నాలో కొత్త ప్రేరణకు తెర లేపింది. ఈ అపజయమే తమలో జయంబాట పట్టించింది. విద్యార్థి దశలోనే 4 నెలలపాటు ముషీరాబాద్ జైలుకు వెళ్లాను. అందులోనే బాగా చదివాను. ఇంటర్‌లో బైపీసీ తీసుకొని పాసయ్యాను. అప్పుడు క్లాస్‌లో పాసయిన వారికే మెడిసిన్ రాసే అర్హత ఉండేది. కానీ నేను ఉద్యమంలోకి వెళ్లడంతో మెడిసిన్ చేయలేకపోయాను. ఆనాడే ఆదర్శ బాలల సంఘం ఏర్పాటు చేశాను. 8, 9, 10వతరగతుల్లో జనం మేల్కొన్నారు జాగ్రత్తా అనే నాటకం వేశాం. మాకు విఠల్ సార్ మేకప్, చొప్పకట్ల చంద్రమౌళి సార్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. తాను రాసిన సాహిత్యంపై అనితాకుమారికి ఉస్మానియా యూనివర్సిటీలో డాక్టరేట్ లభించడం ఆనందంగా ఉంది. దీనికి ఈ పాఠశాలనే ప్రధాన కారణం. సర్కారు బడుల్లో స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. – జనశక్తి అగ్రనేత కూర దేవేందర్ అలియాస్ అమర్, ఆర్గనైజర్ వారాల దేవయ్య

కాలినడకన వచ్చేవాళ్లం



మేము పదోతరగతి చదివే సమయం పూర్తిగా ఎమర్జెన్సీ టైం. మాది అనుపురం. రోజు 6 కిలోమీటర్లు కాలినడకన స్కూల్‌కు రావాలి. కనీసం సైకిల్ కూడా లేదు. ఎలాగో చదివాం. కానీ అప్పుడు ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జగన్మోహన్‌రెడ్డి మా పరీక్షలు బాగా స్ట్రిక్ట్‌గా నడిపించారు. దీంతో మేము 160 మందికి కేవలం ఐదుగురమే పాసయ్యాం. యాభై ఏళ్లకు మేమంతా కలుసుకోవడం ఎంతో ఆనందం, అనుభూతి నింపింది. మళ్లీ స్కూల్‌కు వచ్చినట్లు అనిపించింది.

– కె.నర్సింగారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, సిరిసిల్ల

టీచర్‌గా పని చేశా



మాది వేములవాడ. ఇదే స్కూల్‌లో 6వతరగతి నుంచి ఇంటర్ వరకు చదివా. విద్యార్థి నాయకుడిగా గెలిచా. ఇదే స్కూల్‌లో టీచర్‌గా, స్కూల్ కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రటరీగా పని చేశా. యాభై ఏళ్లకు మేమంతా కలుసుకునేందుకు అనేకసార్లు స్కూల్‌కు వచ్చాను. కానీ మా రిజిస్టర్ కూడా లేదు. మేము కొంతమంది కలుసుకొని అందరి అడ్రస్ సేకరించి కలుసుకున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఇందుకు సహకరించిన వారాల దేవయ్య, రేగుల దేవేందర్, ఇతర మిత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– ఇప్పపూల దేవయ్య, ఆర్గనైజర్, రిటైర్డ్ టీచర్



బోయినపల్లి: వెంకట్రావుపల్లి చౌరస్తా నుంచి కొత్తపేట వెళ్లే దారిలో వైన్ షాపు ఎదురుగా పాత ఐరన్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ గతంలో ఒక కుక్క కూడా చనిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి చెట్లున్నాయి. ఇనుప ట్రాన్స్‌ఫార్మర్ కావడంతో వర్షాకాలంలో విద్యుత్ షాక్ వచ్చే ప్రమాదముంది. సిమెంట్ పోల్స్‌తో ట్రాన్స్‌ఫార్మర్ బిగించి అక్కడ పిచ్చి మొక్కలు తొలగించాలి. – ఇరువాల మహేందర్, వెంకట్రావుపల్లి

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాకేశ్‌రెడ్డి, ఇన్‌చార్జి సెస్ ఏఈఈ, బోయినపల్లి, సెల్ నంబర్: 9440814076

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

మన్‌కీ బాత్ వీక్షించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు



తంగళ్లపల్లిలో వీక్షిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డిబోయిన గోపి వీక్షించారు. మండల కేంద్రంలోని జిల్లా నాయకుడు ఆసాని రామలింగారెడ్డి ఇంట్లో నాయకులతో కలిసి చూశారు. మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు, జిల్లా మీడియా కన్వీనర్ కాసుగంటి రాజురావు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ జూకంటి అఖిల్, కోల ఆంజనేయులు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు ఆసాని లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు, ప్రజలు ఆదివారం వీక్షించారు. శివంగాలపల్లిలో మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామస్తులతోపాటు నాయకులు తిలకించారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడు గొట్టె రామచంద్రం, మండల ప్రధాన కార్యదర్శి బైరగోని సురేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు చింతల పరశురాం, సోషల్ మీడియా కన్వీనర్ జెలేందర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లాల నుంచి కలుషిత నీరు



నల్లా నుంచి వచ్చిన మురుగు నీరుతో సమితి సభ్యుల నిరసన

సిరిసిల్లటౌన్: మున్సిపల్ నల్లాల ద్వారా వస్తున్న తాగునీరు పూర్తిగా కలుషితమై తాగలేని పరిస్థితుల్లో సిరిసిల్ల వాసులున్నారని పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కుళాయిల నుంచి వచ్చిన మురుగు నీటిని చూపిస్తూ నిరసన తెలిపి మాట్లాడారు. వర్షాకాలంలో అధికారులు అప్రమత్తమై శ్రద్ధ వహించకపోవడంతో కలుషిత నీరు వస్తోందన్నారు. సమితి సహాయ కోశాధికారి కుసుమ గణేశ్, కోశాధికారి చిప్ప దేవదాస్ పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచేందుకే పోటీలు



గెలుపొందిన క్రీడాకారులు

చందుర్తి: యువకులకు క్రీడలపై ఆసక్తి పెంచేందుకే పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ గంగిపెల్లి స్వామి పేర్కొన్నారు. మై భారత్‌లో భాగంగా చందుర్తిలోని జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం మండల స్థాయి వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. ఈ పోటీల్లో 12 జట్లు పాల్గొన్నాయి. విజేతగా మల్యాల జట్టు, రన్నరప్‌గా చందుర్తి జట్టు నిలిచాయి. టోర్నమెంటు నిర్వాహకులు మేడిశెట్టి శ్రీహరి, స్థానిక నాయకులు గొట్టె ప్రభాకర్, తిప్పని శ్రీనివాస్, మార్త సత్తయ్య, పొన్నాల శ్రీనివాస్‌రావు, లింగాల మల్లయ్య, బత్తుల కమలాకర్, సిరికొండ శ్రీనివాస్, పులి సత్తయ్య, చిర్రం తిరుపతి, పోంచెట్టి రాకేశ్, మార్త రాజు, గుగ్గిళ్ల సాగర్, వెంగుల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



బాల్‌లింగంను సన్మానిస్తున్న గ్రామస్తులు

ముస్తాబాద్: తుర్కపల్లికి చెందిన శివ్వాని బాల్‌లింగం ఇటీవల పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపిక కాగా.. గ్రామ యువకులు ఆదివారం సన్మానించారు. ఏడాది క్రితం జరిగిన కానిస్టేబుల్ ఎంపిక పరీక్షలో సాంకేతిక కారణాలతో బాల్‌లింగం ఉద్యోగంలో చేరలేదని యువజన నాయకుడు జవ్వాజి బాలకృష్ణ గౌడ్ పేర్కొన్నారు. న్యాయ పోరాటం ద్వారా పీసీగా ఎంపికైన బాల్‌లింగం అందరికీ ఆదర్శమన్నారు.

రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం



ముస్తాబాద్‌లో రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన నాయకులు

ముస్తాబాద్: ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు రాహుల్‌గాంధీ చేపట్టిన యాత్రను విమర్శించడం సరికాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్‌లో రాహుల్‌గాంధీ చిత్రపటానికి నాయకులు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, వైస్ చైర్మన్ వెల్మల రాంరెడ్డి, కొండం రాజిరెడ్డి, అనిత, గజ్జెల రాజు, గుండెల్లి శ్రీను, దీటి నర్సింలు, రాజేశం, కొంరయ్య, ప్రశాంత్, నర్సింలు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: యూవజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎగుర్ల ప్రశాంత్ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల కేంద్రంలోని మండెపల్లి చౌరస్తాలో నాయకులతో కలిసి మాట్లాడారు. మోర లక్ష్మీరాజం, బండి పర్శరాములు, గణాది కిషన్, పరశురాములు, రాపెల్లి ఆనందం, సామల రమేశ్, మోర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల నాయకులు రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. 2 రోజుల క్రితం బీజేపీ నాయకులు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కొమిరిశెట్టి తిరుపతి, హమీద్, ప్రభాకర్, అంజిరెడ్డి, శంకర్, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ నంది కమాన్ వద్ద బీజేపీ నాయకులు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేయబోతుండగా పోలీసులు అడ్డుకున్నారు. బుర్ర శేఖర్‌గౌడ్ తదితరులున్నారు.

ఆది శ్రీనివాస్‌ను విమర్శించే స్థాయి లేదు

వేములవాడ: నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి బీఆర్ఎస్ నేతలకు కనిపించడం లేదా అని, విప్ ఆది శ్రీనివాస్ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు.